

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 ; కనిష్ఠం : 17.0

రాష్ట్ర స్థాయి జానపద నృత్యంలో విద్యార్థుల ప్రతిభ

తెలకపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అంశంపై ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణశాఖ గోదావరి ఆడిటోరియం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జానపద నృత్య పోటీలలో పెద్దపల్లి పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారని గైడ్ టీచర్‌గా వ్యవహరించిన చాంద్‌పాషా తెలిపారు. ఇచ్చిన అంశానికి తగ్గట్టుగా తమ నృత్య ప్రతిభను కనబర్చిన విద్యార్థులు శ్రావణి, వసుంధర, స్వప్న, స్వాతి, గీతామధురి, లౌకికలను జిల్లా విద్యాశాఖాధికారి గోవింద రాజులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్, ఏఎంవో ఎండీ షర్ఫుద్దీన్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మల్లేష్, లలిత పాల్గొన్నారు.

రబీ సాగు సందిగ్ధం

- ఖరీఫ్ సీజన్‌లో 83వేల ఎకరాల్లో సాగు
- యాసంగికి నీటి విడుదల ఉంటుందా..?
- ఐఏబీ సమావేశం తర్వాత నీటి విడుదలపై స్పష్టత
- జూరాల ఎడమ కాలువ ఆయకట్టుకు విడుదల చేయాలంటున్న రైతులు



ఎడమ కాలువ ద్వారా సాగుకు విడుదలవుతున్న నీరు (ఫైల్)

ఆత్మకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలకు వరప్రదాయనిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు తాగు, సాగునీటి అవసరాలను తీరుస్తున్నది. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎగువ నుంచి ప్రాజెక్టుకు ఆశించిన మేర వరద రాకపోవడంతో ఖరీఫ్ సీజన్‌కు మాత్రమే నీటి విడుదల చేసి రబీ సీజన్‌కు నీటి విడుదల చేయలేదు. దీని కారణంగా రైతులు క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈ ఏడాది ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీ స్థాయిలో వరద వచ్చి చేరింది. ప్రజా ప్రతినిధుల ఆదేశాల మేరకు ప్రాజెక్టు అధికారులు జూలై మొదటి వారంలోనే కుడి, ఎడమ కాలువలకు సకాలంలో నీటి విడుదల చేశారు. ఎడమ కాలువ ఆయకట్టు పరిధి రైతులు 83 వేల ఎకరాలు, కుడి కాలువ ఆయకట్టు పరిధిలో 35 వేల ఎకరాల సాగు చేశారు. జూలై మొదటి వారంలో నీటి విడుదల చేసిన కారణంగానే ముందుగా నార్లు పోసుకున్న రైతులు అక్టోబరు చివరి వారం నుంచి నవంబరు చివరి వారం వరకు కోతలు పూర్తి చేశారు. మళ్లీ యాసంగి కోసం నార్లు పోసుకోవడానికి సిద్ధమయ్యారు.



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్

యాసంగికి నీరు విడుదల చేయాలి

గత ఏడాది వర్షాభావ పరిస్థితులతో నీటి విడుదల చేయని కారణంగా రైతులు క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈ ఏడాది అత్యధికంగా వర్షాలు కురిశాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో తొమ్మిది టీఎంసీలకు పైగా నీరు ఉంది. అలాగే ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి కూడా స్వల్పంగా రోజు వారీగా ఐదువేల క్యూసెక్కులు విడుదలవుతున్నది. దీంతో ఈ ఏడాది కూడా యాసంగికి సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రతీ ఏడాది యాసంగి పంటకు సాగునీటి విషయంపై ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రాజెక్టు అధికారులు, రైతు సంఘాల నాయకుల సమావేశం అనంతరమే సాగునీటి విడుదలపై స్పష్టత ఇచ్చే ఆనవాయితీ కొనసాగు తుందని ప్రాజెక్టు అధికారులు అంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు అత్యధికంగా సన్నరకం వరి సాగుకు మొగ్గుచూపుతున్నారు.

యాసంగి పంటకు నీటిని విడుదల చేయాలి



గతేడాది ప్రాజెక్టులో నీరు తక్కువగా ఉండటంతో సాగునీటిని విడుదల చేయకపోవడంతో రైతులు క్రాప్ హాలీడే ప్రకటించారు. ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు కురిశాయి. ఎగువ నుంచి స్వల్పంగా వరద వస్తున్న కారణంగా ముందుగానే నీటిని విడుదల చేస్తే నార్లు పోసుకుని ఏప్రిల్ నాటికి యాసంగి పంట పూర్తి చేసుకునే అవకాశం ఉంది.

- విష్ణువర్ధన్ రెడ్డి, ఆయకట్టు రైతు సంఘం నాయకుడు

సమావేశం అనంతరమే స్పష్టత



ప్రతీ ఏడాది ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు ప్రాజెక్టు అధికారులు రైతు సంఘం నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసిన అనంతరమే సాగునీటి విడుదలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. డిసెంబరు నెలలో సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఆ తరువాత ఎన్ని ఎకరాలకు సాగునీటిని అందిస్తామనే విషయాలు వెల్లడిస్తాం. రైతులు తొందర పడొద్దు.

- జగన్మోహన్, ప్రాజెక్టు ఈఈ



మహమ్మదాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అపరిశుభ్ర వాతావరణంలో వంట చేస్తున్న నిర్వాహకులు

అపరిశుభ్రత.. అలసత్వం

సర్కారు బడుల్లో పడకేసిన పారిశుధ్యం

- మధ్యాహ్న భోజనం వండే గదులు అపరిశుభ్రం
- ఉమ్మడి జిల్లాలో 3327 ప్రభుత్వ పాఠశాలలు
- మెనూ కూడా అంతంతే

మహబూబ్‌నగర్ విద్యావిభాగం నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత కనిపించడం లేదు. కిచెన్ షెడ్లు, మురికి కూపాలను తలపిస్తున్నా వాటి గురించి పట్టించుకునే వారే కానరారు. వంట కార్మికులు మాత్రం వండామా.. విద్యార్థులకు వడ్డించామా అన్నంత వరకే చూసుకుంటున్నారు. మెనూ పాటించరు. అటువైపు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చూడ ట్లేదు. కనీసం భోజనం నాణ్యతను కూడా పరిశీలించరు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలో కొంత వరకు పరిశీలించినా విద్యార్థుల సంఖ్య రెండు మూడు వందలు ఆపైన ఉంటే ఉపాధ్యాయులు పట్టించుకోరన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో విద్యార్థులకు పురుగుల అన్నం, నీళ్లచారు, ఉడికీ ఉడకని కూరగాయలతో పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు అటువైపు చూడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కలుషిత ఆహారం తిని వంద మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన ఇందుకు నిదర్శనం.

గతంలో పాలమూరు జిల్లా కేంద్రానికి సమీపంలోని బోయపల్లి ఉన్నత పాఠశాలలో పురుగుల అన్నం వచ్చిందని విద్యార్థులు రోడ్డుపై బైటాయించిన ఘటనలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ మాత్రం ఘటన జరిగిన సమయంలో హడావిడి చేసి ఆ తర్వాత కనీసం పాఠశాలలో భోజనం పట్టించుకోవడం లేదు. ఇక కేజీబీవీలలో అయితే చెప్పనక్కరలేదు. కనీసం మహబూబ్‌నగర్

అపరిశుభ్రంగా వంట గదులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం వండే గదులు అపరిశుభ్రంగా ఉన్నాయి. కనీసం వాటిని నెలలు గడిచినా శుభ్రం చేసిన పాపాన పోరు. కొన్ని పాఠశాలల్లో వంట గదులు చిన్నగా ఉండటంతో అందులో వంట సామగ్రి, వంటకు అవసరమయ్యే కట్టెలు ఉంచి ఆరుబయట వంట చేస్తున్నారు. దీంతో వంట వండే సమయంలో దుమ్ము ధూళి వచ్చిపడుతుంది. విద్యార్థులకు అలాగే వడ్డిస్తున్నారు. చాలా పాఠశాలల్లో వంటకోసం కలిషిత నీటిని వాడు తున్నారు. వంట వండే దగ్గరనే మురుగునీరు నిలిచినా పట్టించుకోవడం లేదు. ఆ పరిసర ప్రాంతంలో దోమలు, ఈగలు విలయతాండవం చేస్తున్నాయి. కనీసం వంట ఏజెన్సీ సభ్యులు వంట పూర్తి చేసిన తర్వాత ఆ పరిసర ప్రాంతాన్ని శుభ్రం చేయకపోవడంతో మరుసటి రోజు తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీన్ని చూసిన ఉపాధ్యాయులు కూడా వంట కార్మికులకు శుభ్రం చేయాలని సూచించారు.

మిగతా 6వ పేజీలో...

రాళ్లు తేలిన దారులు

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న చెంచులు
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు
- రేషన్ బియ్యం కోసం 30 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే
- అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు రాక అవస్థలు పడుతున్న గిరిజనులు

6



ఈర్లపెంట వెళ్లే రోడ్డుపై అతి కష్టంగా ముందుకు సాగుతున్న చెంచుల ఆటో

రాజులే పోయినా.. రాజ్యాలు కూలినా

- నిలిచి ఉన్న కోయిలకొండ ఖిల్లా
- నాలుగు వందల ఏళ్ల క్రితం నిర్మాణం
- చారిత్రక వైభవానికి నిలువెత్తు నిదర్శనం
- రాష్ట్రంలోని ఏడు గిరి దుర్గాల్లో ఇది ఒకటి



కోయిలకొండ కోటలోని అశ్వశాల

7

తమ్ముడి హత్య కేసులో అన్న అరెస్ట్

- కొడుకులతో కలిసి సోదరుడిపై దాడి
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు

7

ముగిసిన కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు

- స్వామి ఆభరణాలను ఆత్మకూర్ ఎస్‌బీఐలో భద్రపరిచిన అధికారులు
- అమావాస్య దాకా జాతర..



6

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన

- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ
- ధూంధాంగా సాగిన కళాప్రదర్శనలు

గద్వాల టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సమగ్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతున్నదని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలను తెలంగాణ సాంస్కృతిక సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన 48 గంటల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ ల్లో రెండింటిని ప్రారంభించిందని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందే వైద్య సేవల సంఖ్యను 1,835 కు పెంచి ఆర్థిక పరిమితిని సైతం రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెంచిందన్నారు. రూ.500లకే వంట గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వినియోగం దేశ చరిత్రలోనే అరుదైనవన్నారు. 31వేల కోట్ల రూపాయల పంట రుణాలను మాఫీ చేసి అన్నదాతలకు అండగా నిలిచిందన్నారు. ఏడాది కాలంలోనే 50వేల ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి నిరుద్యోగ యువతలో భరోసా పెంచిందన్నారు. హాస్టల్ విద్యార్థుల కాస్మొటిక్, మెస్‌చార్జీలను పెంచడం, అమ్మఆదర్శ పాఠశాల కమిటీలతో బడులను బలోపేతం చేయడం వంటి అనేక అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ కళాకారులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జడ్పీ సీఈవో కాంతమ్మ, జిల్లా గ్రంథాలయం చైర్మన్ నీలి శ్రీనివాసులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎంపీ రమేష్ ఉన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తెలంగాణ సాంస్కృతిక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య



ప్రభుత్వ పథకాలను కళారూపాల్లో ప్రదర్శిస్తున్న కళాకారులు

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- బీసీ వసతిగృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ బదావత్ సంతోష్



అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

వెల్దండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహించరాదని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు లబ్ధిదారులకు అందించకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీసీ వసతిగృహం, అంగన్‌వాడీ కేంద్రం - 2 ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను, రిజిస్టర్‌లను పరిశీలించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కేంద్రాలు నిర్వహించాలని, మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతం విధిగా అందించాలన్నారు. బీసీ వసతి గృహంలోని స్టోర్‌రూం, కిచెన్, మరుగుదొడ్లు, ఆఫీసు, స్టాఫ్‌రూంను ఆయన పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వసతి గృహంలో డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని వార్డెన్ రామకృష్ణకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీను, బీసీ సంక్షేమశాఖ అధికారి ఖాజా అఫ్సర్‌నాజిం అలీ, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందిస్తాం

- జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి సుధారాణి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గద్వాల న్యూటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన ఆహారాన్ని అందించడమే తన బాధ్యత అని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి సుధా రాణి ఆంధ్రజ్యోతి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహారం ఎలా ఉంటుంది..?

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషక విలువలు పెంచేలా, జీర్ణశక్తికి ఉపయోగపడేలా ఫోర్టిఫైడ్ రైస్ ఇస్తున్నాం. అంతేకాకుండా చిన్నారుల పెరుగుదలకు విజయడైరీ పాలు, గుడ్లు అందిస్తున్నాం.

జిల్లాలో అంగన్‌వాడీలకు ఎన్ని సొంత భవనాలు ఉన్నాయి..?

జిల్లాలో మొత్తం 713 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 208 సొంత భవనాలు, 236 అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. వీటిలో మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. వీటికి కరెంట్ కనెక్షన్ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాల్సి ఉంది.

అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లు సమయపాలన పాటిస్తున్నారా..?

కొన్ని రోజుల నుంచి ఈ విషయంపై నిఘా ముమ్మరం చేశాం. అందరు టీచర్లు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం.

సఖి సెంటర్ నిర్వహణపై ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఎలా స్పందిస్తారు..?

గతంలో ఈ విషయంపై ఆరోపణలు వచ్చిన మాట వాస్తవమే. అయితే ఈ విషయాలు మరల జరుగకుండా ఒక సీడీపీవోతో ప్రతినిత్యం పర్యవేక్షణ జరిగేలా చూస్తున్నాం.

అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు..?

జిల్లాలో మొత్తం 175 ప్రీ ప్రైమరి పాఠశాలలు ఏర్పాటు చేయవలసింది ఉంది. ఇందులో 53 పాఠశాలలకు పెయింటింగ్ వేయించాం. అయితే బడ్జెట్ కొరత లేకుండా పూర్తి స్థాయిలో జరిగేలా చూస్తాం. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులుకు, గర్భిణులకు, బాలింతలకు పోషక ఆహారాన్ని అందేలా చూస్తాం.

విద్యార్థులు సైన్స్ పై పట్టు సాధించాలి

- అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సైన్స్ కిట్లు మంజూరు చేస్తాం
- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



సైన్స్ ఫేర్‌లో ప్రదర్శనలు తిలకిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ పై పట్టు సాధించేందుకు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర 52 వ బాల వైజ్ఞానిక దర్శిని, 12వ ప్రేరణ అవార్డుల కార్య క్రమాన్ని గురువారం స్థానిక సూర్యచంద్ర ప్యాలెస్ హైస్కూల్లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైన్స్ జీవితంలో చాలా ముఖ్యమైనదని తెలిపారు. చాలా సంవత్సరాల నుంచే విద్యాపరంగా వనపర్తి ముందు వరుసలో ఉన్నదని అన్నారు. ఈ ప్రాంత విద్యార్థులను వైజ్ఞానిక పరంగా ప్రోత్సహిస్తేంచేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ విద్యార్థులకు సైన్స్ పై అవగాహన పెంచేందుకు అన్ని పాఠశాలలకు సైన్స్ కిట్లు మంజూరు చేశామన్నారు. విద్యార్థులు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. డీఈవో గోవిందరాజులు మాట్లాడుతూ.. నేటి నుంచి మూడు రోజుల పాటు వైజ్ఞానిక ప్రదర్శన, ప్రేరణ పోటీలు కొనసాగుతాయని తెలిపారు. జూనియర్ స్థాయిలో ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థులు, సీనియర్ స్థాయిలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైన్స్ ప్రదర్శన పోటీలు ఉంటాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. మొదటి స్థానంలో నిలిచిన వారిని డిసెంబరు మొదటి వారంలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రేరణ అవార్డుల్లో మొదటి స్థానం పొందిన వారికి స్కాలర్‌షిప్ అందజేస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను పరిశీలించారు. కార్యక్ర మంలో వనపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ విధులు అంటేనే

కత్తిమీద సాములాంటివి

● కుటుంబ ధర్మం కంటే... వృత్తి ధర్మానికే ప్రాధాన్యం

● ప్రజలకు పోలీసు శాఖపై గౌరవం ఉంది

● విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

● జిల్లా పోలీసుశిక్షణ కేంద్రంలో ఘనంగా పాసింగ్ ఔట్ పరేడ్


శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డీఐజీ, ఎస్పీలు

జడ్చర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖ విధులు అంటేనే కత్తిమీద సాములాంటిదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కుటుంబ ధర్మం కంటే, వృత్తిధర్మంకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని జిల్లా పోలీసుశిక్షణ కేంద్రంలో గురువారం తొమ్మిది నెలల పాటు శిక్షణ పొందిన కానిస్టేబుల్స్ పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు పోలీసు శాఖపై ఎంతో గౌరవం, ప్రేమ, అభిమానం ఉందని, ఇది 30 సంవత్సరాల అనుభవంతో చెప్తున్నానన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించేది పోలీసుశాఖ అని అన్నారు.

పాసింగ్ ఔట్ పరేడ్‌లో శిక్షణ నాణ్యతపై అంచనావేయవచ్చన్నారు. నైపుణ్యం, దృఢనిశ్చయం, గర్వం, విధులలో ప్రజలు సేవ చేయాలనే తపన శిక్షణ పొందిన అందరిలో కనిపించిందని, ఎంతో సంతోషంగా ఉందన్నారు. తొమ్మిది నెలల శిక్షణలో ఔట్‌డోర్, ఇండోర్ అంశాలలో శిక్షణ ఇస్తారన్నారు. సమష్టిగా, టీం వర్క్‌తో చేసే విధానాన్ని అలవర్చేందుకు శిక్షణలో ఒక భాగమన్నారు. ఔట్‌డోర్‌లో శారీరకదృఢత్వం, క్రమశిక్షణ, కమాండ్ అండ్ కంట్రోల్ అంశాలు సమానంగా వస్తాయన్నారు. ఈ అంశాలపై కచ్చితమైన ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రస్తుతం చట్టాలు మారాయని, శిక్షణ కాలంలో మొదటగా పాతచట్టాలను నేర్చుకుని ఉంటారని, జూలై 1వ తేదీ నుంచి మారిన చట్టాలపై శిక్షణ పొంది మార్పుకు నాంది పలుకుతున్నారన్నారు.

తొమ్మిది నెలల పాటు కఠోరశ్రమ, నాణ్యతతో ఔట్‌డోర్, ఇండోర్ శిక్షణ అందచేసిన శిక్షకులను ఈ సందర్భంగా అభినందించారు. నక్సలిజంను తుదముట్టించిన అంశంతో పాటు అరాచకశక్తులను ఎలా అణచాలో దేశానికి పాఠాలను మన పోలీసు శాఖ నేర్పించిందన్నారు. తొమ్మిది నెలల పాటు శిక్షణ పొందిన 270 మంది కానిస్టేబుల్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజలకు సేవ చేసేందుకు కేటాయించడం జరుగుతుందని, ఉమ్మడి జిల్లాలోని వివిధ జిల్లాలకు విభజింపబడతారన్నారు. జడ్చర్లలోని జిల్లా పోలీసుశిక్షణ కేంద్రం ఏర్పాటు అంశంలో తన పాత్ర ఉందని గుర్తుచేశారు. ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు చేసి, రెగ్యులర్‌గా శిక్షణలు ఏర్పాటు చేస్తామన్నారు. పాసింగ్ ఔట్ పరేడ్‌కు మహ బూబ్‌నగర్ జిల్లాకే వెళ్లాలని ఏరికోరి ఎంచుకు న్నానని, 80ఎకరాల శిక్షణ కేంద్రంను చూసి సంతోషంగా ఉందన్నారు. అనంతరం శిక్షణ కాలంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కాని స్టేబుల్స్‌కు అవార్డులు, ప్రశంసాపత్రాలను అం దచేశారు. ఔట్‌డోర్, ఇండోర్ శిక్షణ ఇచ్చిన శిక్షకులు, నాన్‌టీచింగ్‌స్టాఫ్‌ను ఈ సందర్భంగా అభినందించారు. జోగుళాంబ గద్వాల, మహ బూబ్‌నగర్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, మహ బూబ్‌నగర్, వనపర్తి ఎస్పీలు జానకి, రావుల గిరిధర్, డీటీసీ ప్రిన్సిపల్ రాములు, వైస్ ప్రిన్సిపల్ నర్సిములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డిలతో పాటు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐలు, డీటీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

పరేడ్ నిర్వహించిన శిక్షణ పొందిన కానిస్టేబుల్స్

జడ్చర్లలోని జిల్లా పోలీసుశిక్షణ కేంద్రంలో తొమ్మిదినెలల పాటు శిక్షణ పొందిన కానిస్టేబుల్స్‌కు ఘనంగా పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 94మంది, ఆసిఫాబాద్‌జిల్లాకు చెందిన 55, నిర్మల్ జిల్లాకు చెందిన 67 మంది, సిద్దిపేట జిల్లాకు చెందిన 54 మంది కానిస్టేబుల్స్‌లో శిక్షణ పొందారు. శిక్షణ పొందిన కానిస్టేబుల్స్ పాసింగ్ ఔట్ పరేడ్‌లో భాగంగా పరేడ్ నిర్వహించారు. కానిస్టేబుల్స్ నిర్వహించిన పరేడ్‌ను కానిస్టేబుల్స్ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తిలకించారు.

గౌరవవందన స్వీకారం

జడ్చర్లలోని జిల్లా పోలీసుశిక్షణ కేంద్రంలో పాసింగ్ ఔట్ పరేడ్‌లో తొమ్మిది నెలల పాటు శిక్షణ పొందిన 270 మంది కానిస్టేబుల్స్‌తో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి గౌరవవందన స్వీకారం అందుకున్నారు.



కుటుంబ సభ్యులతో ఆనందంతో ఫొటోలు దిగుతున్న శిక్షణ పోలీసులు

అపరిశుభ్రత.. అలసత్వం


మహమ్మదాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వంట వండే పరిసరాలలో అపరిశుభ్రం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలో కేజీబీవీలను పరిశీలించే నాథుడే లేడు. విద్యా సంవత్సరం ఆ రంభంలో జిల్లా కేంద్రానికి సమీప మండలంలో ఉన్న ఓ కేజీబీవీలో విద్యార్థినులకు వడ్డించే చారులో కప్ప కళేబరం రాగా... మరో కేజీబీవీలో విద్యార్థులకు కారం పొడి అన్నం పెట్టిన ఘటనలు తెలిసిందే. ఈ విషయాలను విద్యార్థులు తల్లిదండ్రులకు చెపితే వారిని వేధించిన ఘటనలూ లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, కేజీబీవీలో మెనూపై దృష్టి పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● **మెనూ అంతంతే ..**

మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన విధంగా భోజనం అందించాలి. వారంలో మూడురోజులు (సోమ, బుధ, శుక్రవారాలు) తప్పని సరిగా గుడ్డు ఇవ్వాలి. కానీ ఇది ఉమ్మడి జిల్లాలో సగంపైగా పాఠశాలల్లో అమలు కావడం లేదని ఉపాధ్యాయులే చెబుతుండటం గమనార్హం. కొన్ని పాఠశాలల్లో బిల్లు రావడం లేదని చెబితే, మరికొన్ని పాఠశాలల్లో వంట ఏజెన్సీలకు వచ్చే గుడ్డు బిల్లు (డబ్బు)ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అకేషన్స్ జరిగిన సమయంలో వాడుకున్నారని వంట నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. వంట ఏజెన్సీల మధ్య గొడవలు కూడా అనేక పాఠశాలల్లో ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని మహమ్మదాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో సుమారు 400 పైగా విద్యార్థులు ఉంటారు. అక్కడ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తినేందుకు డైనింగ్ హాల్ కూడా కట్టించారు.. కానీ అది అందుకు ఉపయోగించడం లేదు. దీంతో విద్యార్థులు ఆరుబయటే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు.

● **కేజీబీవీల పరిస్థితి చెప్పనక్కర లేదు..**

మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తంగా కేజీబీవీలలో కూడా మెనూ సరిగా ఇవ్వడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో జిల్లాలోని పలు కేజీబీవీల మెనూకు సంబంధించి విద్యాశాఖ అధికారులకు విద్యార్థులు ఫిర్యాదులు కూడా చేశారు. కానీ మొక్కుబడిగా పర్యవేక్షించిన అధికారులు ఇప్పుడు అటువైపు చూడటం లేదు. గత కొన్ని నెలలుగా కేజీబీవీలకు పర్యవేక్షణ అధికారి లేరు. ఇన్‌చార్జిలతోనే గడుపుతున్నారు. ఇందుకు సంబంధించి అన్ని అర్హతలు ఉన్న వారికి విధుల్లోకి తీసుకోవడం లేదు. దీంతో కేజీబీవీలపై పర్యవేక్షణ సాగడం లేదు.

ముగిసిన కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు

- స్వామి ఆభరణాలను ఆత్మకూర్ ఎస్‌బీఐలో భద్రపరిచిన అధికారులు


ఆత్మకూరు ఎస్‌బీఐ బ్రాంచిలో ఆభరణాలను భద్రపరుస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, బ్యాంకు సిబ్బంది

చిన్నచింతకుంట/ఆత్మకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. కాగా స్వామి వారి ఆభరణాలను ఆలయ ప్రాంగణంలో అధికారులు, చైర్మన్, పాలక వర్గం సభ్యులు, ఎస్ఐ సమక్షంలో వాటిని పరిశీలించారు. అనంతరం స్వామి వారి బంగారు ఆభరణాలను మొత్తం ఓ పెట్టెలో ఉంచి, ఊరేగింపుగా స్వామి మెట్లదారి గుండా రాజగోపురానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆభరణాలను మేళతాళాలతో, మంగళవాయిద్యాల నడుమ ఆత్మకూర్ ఎస్‌బీఐలోని లాకర్‌లో భద్రపరిచారు.

కాగా, స్వామి వారి బ్రహ్మోత్సవాలు గత నెల 31న యాగశాల మండపాలంకరణతో ప్రారంభమయ్యాయి. ఈనెల 6న అలంకారోత్సవం, 8న ఉద్దాలోత్సవం నిర్వహించారు. అయితే ఉద్దాలోత్సవానికి పెద్ద ఎత్తున దాదాపు మూడున్నర లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

కొనసాగనున్న జాతర

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు ముగిసినా, జాతరలో భక్తుల రద్దీ మాత్రం ఉంటుంది. అమావాస్య వరకు భక్తుల రద్దీతో పాటుగా జాతర కొనసాగనుంది. జాతరలో కొనుగోలు దారుల సందడి మరింతగా ఉండే అవకాశం ఉంది.

బ్యాంకుకు చేరిన ఆభరణాలు

కురుమూర్తి స్వామి ఆభరణాలను ఆత్మకూరు ఎస్‌బీఐ బ్యాంకులో భద్రపరచడానికి తరలించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, ఈవో మదనేశ్వర్ రెడ్డిలు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ అబ్బాస్ సమక్షంలో బ్యాంక్ లాకర్‌లో భద్రపరిచినట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ... ఈనెల 6వ తేదీన కురుమూర్తి స్వామి అలంకరణోత్సవం సందర్భంగా స్వామి వారికి ఆభరణాలను అలంకరించేందుకు ఆత్మకూరు బ్యాంకు నుంచి తరలించామని తెలిపారు.

పక్షం రోజుల పాటు స్వామి వారికి అలంకరించిన అనంతరం ఆభరణాలను బ్యాంకులో భద్రపరచనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు


ఎకో పార్కు పరిసరాలను శుభ్రం చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

కొల్లాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సోమశిల రహదారిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎకో పార్కు పరిసరాల్లో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది గురువారం పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. అటవీ రేంజ్ సమీపంలో ఉన్న ఎకో పార్కు పరిసరాల్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను, ఏపుగా పెరిగిన గడ్డిని అటవీ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఫారెస్టు రేంజ్ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ కొల్లాపూర్ అటవీ పరిసరాల్లో సంచరించే పర్యాటకులు తమ వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలను అటవీ ప్రాంతంలో వదిలి వెళ్లరాదని అన్నారు.

వాటి వల్ల వన్య ప్రాణులకు హాని కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు ముజీబ్‌గోరి, శివకుమార్, నీలేష్, బయన్న, జయరాజ్, మల్లేస్, బీట్ అధికారులు లక్ష్మయ్య, వెంకటయ్య, నాగార్జున గౌడ్, లిఖిత, బేస్ క్యాంపు వాచర్లు పాల్గొన్నారు.

నిజమైన కల్పవృక్షం సీఎం రేవంత్ రెడ్డి

- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అచ్చంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజమైన కల్పవృక్షమని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విషవృక్షంలాంటోడని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోయినా ప్రజలకు ఇచ్చినమాట నిలబెట్టుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి తండ్రీకొడుకులు అడ్డుపడుతున్నారని అన్నారు. మా ప్రభుత్వంలో మహిళలకు ఉచిత ప్రయాణం, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్ సరఫరా చేస్తున్నామని, త్వరలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే కార్యక్రమం మొదలు పెడుతామన్నారు. నాగర్‌కర్నూల్‌లో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తామని, మహిళలకు రూ.200 కోట్ల అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని అన్నారు. నియోజకవర్గంలోని 390 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు, 85మంది సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, విజయ డెయిరీ అధ్యక్షుడు నర్సయ్య యాదవ్, నాయకులు మల్లేష్, గోపాల్‌రెడ్డి, రామనాథం, కట్ట అనంతరెడ్డి, నరసింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ, వివిధ మండలాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన దారులు


గుంతలుపడి రాళ్లు తేలిన మల్లాపూర్ పెంటకు వెళ్లే రోడ్డు

మన్ననూర్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): సమీకృత గిరిజాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) పరిధిలోని చెంచు పెంటలకు వెళ్లే దారులు రాళ్లు తేలి, గోతులమయంగా మారాయి. దీంతో ఆదివాసీలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడవుల్లో నివసించేందుకు సర్వ హక్కులు కలిగి ఉన్నప్పటికీ వారి పెంటలకు ఉన్న రహదారులు బాగు చేయడానికి అటవీ ఆంక్షలు అడ్డుపడుతున్నాయి. ఇకో టూరిజంలో భాగంగా టైగర్ సఫారీ పర్యటన జరిపే ప్రాంతాల్లో రహదారులు అభివృద్ధి చేస్తున్నారు. వన్యప్రాణుల రక్షణ, అడవుల అభివృద్ధిలో భాగస్వామ్యులుగా ఉంటున్న చెంచులు నివాసం ఉండే ప్రాంతాల్లోని రహదారుల అభివృద్ధికి మాత్రం అటవీశాఖ ఆంక్షలు అడ్డు వస్తున్నాయి. అమ్రాబాద్ మండలం మన్ననూరుకు 45 కిలో మీటర్ల దూరంలో ఉండే సంగిడిగుండాల, ఈరపెంట, మేడిమాల్కల, బౌరాపూర్, మల్లాపూర్, కొల్లంపెంట, కొమ్మన పెంట, ఈర్లపెంటల రహదారులు రాళ్లు తేలి గోతుల మయంగా ఉన్నాయి. ఆదివాసీలు అనారోగ్యానికి గురైన సందర్భాల్లో, నిత్యావసర సరకులు, రేషన్ బియ్యాన్ని తీసుకెళ్లేందుకు ఆటోలు సైతం వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. చెంచులు ఆటోలు దిగి కొంత దూరం నడిచి, మళ్లీ ఆటో ఎక్కి ప్రయాణిస్తున్న సందర్భాలు అనేకంగా ఉన్నాయి. చెంచు పెంటలకు వైద్య సేవల నిమిత్తం 102 , 108 వాహనాలు, అపోలో, ఆర్బీటీ , వైద్య బృందాలు ఈ రహదారులపై నిలిచి పోయి ఇబ్బంది పడిన సందర్భాలు అనేకంగా ఉన్నాయి. సాయంత్రం నాలుగు గంటలు దాటితే చెంచు పెంటలకు వైద్య సేవల నిమిత్తం ఏదైనా ఫోన్‌కాల్ వస్తే 102, 108 సిబ్బంది జంకుతున్నారు. ఐసీడీఎస్ సిబ్బంది సైతం రహదారులు బాగా లేవని సాకు చూపిస్తూ చెంచులకు సక్రమంగా పౌష్టికాహారం అందించడం లేదు. మన్ననూరులో ఐటీడీఏ ఉన్నా చెంచుల సమస్యలు వినే అధికారులే లేరు. రెగ్యులర్ ఐటీడీఏ పీవో లేకపోవడంతో ఇన్‌చార్జి పీవోగా ఉన్న డీఎఫ్‌వో రోహిత్ గోపిడికి చెంచులు రోడ్ల సమస్యలు చెప్పుకోలేకపోతున్నారు. ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించి తమకు రాకపోకలు సాగించే రోడ్డు మార్గాలను బాగు చేయించాలని నల్లమల చెంచులు అభిప్రాయపడుతున్నారు.

అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలంటే ఇబ్బందే..



చెంచు కుటుంబంలో ఎవరికైనా జబ్బు ఆస్పత్రికి వెళ్లాలంటే దారులు గుంతలుగా ఉండటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. 40 కిలో మీటర్లు ప్రయాణించాలంటే కనీసం మూడు గంటల సమయం పడుతోంది. రోడ్డు బాగా లేనందుకు అంబులెన్సులు రావడం లేదు.

- గురువయ్య, చెంచు గిరిజనుడు, ఈర్లపెంట

రేషన్ బియ్యం తీసుకొచ్చేందుకు ఇబ్బంది పడుతున్నాం



రేషన్ బియ్యం తెచ్చుకోవాలంటే 30 కిలోమీటర్ల దూరంలోని అప్పాపూర్ డీఆర్‌డిపోకు ఆటోల్లో వెళ్లాలి. దారి సరిగ్గా లేక పోవడంతో చాలా మంది మహిళలు రోజంతా కాలినడకన అప్పాపూర్‌కు వెళ్లి అక్కడే రాత్రి ఉండి మరునాడు ఉదయం రేషన్ దుకాణంలో బియ్యం తీసుకొని వస్తున్నారు. రోడ్లను బాగు చేస్తే ఇలాంటి సమస్యలు ఉండవు. ఐటీడీఏ అధికారులు తమ సమస్యను పరిష్కరించాలి

- నిమ్మల మల్లీశ్వరి, మేడిమాల్కల పెంట

విద్యార్థినులను వేధించిన ఉపాధ్యాయుడు

- పాఠశాలలోనే నిలదీసిన తల్లిదండ్రులు

పదర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యాబుద్ధులు నేర్పుతూ భావి భవిష్యత్‌కు పునాదులు వేయాల్సిన ఉపాధ్యాయుడే విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలో గురువారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఓ పాఠశాలలో క్రమశిక్షణ నేర్పించాల్సిన వ్యాయామ ఉపాధ్యాయుడు తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో పాటు చెప్పుకోలేని విధంగా దూషిస్తున్నాడని బాధిత విద్యార్థినులు తల్లిదండ్రులతో వాపోయారు.

దీంతో పాఠశాలకే వచ్చిన తల్లిదండ్రులు గురువారం ఆ ఉపాధ్యాయున్ని పాఠశాలలోనే నిలదీశారు. అంతే కాకుండా ఉన్నతాధికారులను కలుద్దామని వెళ్లగా అక్కడ ఆ వ్యాయామ ఉపాధ్యాయుడే ఇన్‌చార్జి హెచ్ఎం అని తేలడంతో ఇంకోసారి ఇలా చేస్తే ఊరుకునేది లేదని తేల్చి చెప్పి వెళ్ళిపోయారు. ఇదిలాఉండగా అంతకు ముందు రోజు తండ్రిలేని ఓ విద్యార్థిని తల్లి పిల్లలను ఎందుకు తిడుతున్నావని అదే ఉపాధ్యాయున్ని ప్రశ్నించగా టీసీ ఇచ్చి పంపిస్తాం, వెళ్ళిపో అని హెచ్చరించడంతో నిరక్షరాస్యురాలైన ఆ తల్లి కన్నీటితో వెనుదిరిగినట్లు సమాచారం.

ఈ విషయంపై ఆంధ్రజ్యోతి ఎంఈఓ బుచ్చిబాబును వివరణ కోరగా ఇది నిజమేనని నెల రోజుల క్రితం తమ దృష్టికి వచ్చిందని, అప్పట్లో అతన్ని హెచ్చరించానని చెప్పారు.

కులగణనతో బీసీల లెక్క తేలుతుంది

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ ప్రజాప్రతినిధుల సంఖ్య పెరుగుతుంది
- పటాన్ చెరువు కాంగ్రెస్ నేత నీలం మధు
- ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం


సభలో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు

కొల్లాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ నాయకత్వం ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేపట్టారని, కుల గణన తరువాత బీసీల లెక్కతేలుతుందని పటాన్ చెరు కాంగ్రెస్ నాయకుడు నీలం మధు అన్నారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో తెలుగు తెనుగోళ్ల జెండాను డాక్టర్ పగిడాల శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీగా పట్టణంలోని ఎస్ఎం గార్డెన్‌కు చేరుకుని ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి మహాత్మా జ్యోతిరావు పూలే, పోలీస్ కిష్టన్న, పండుగ సాయన్న, సింగోటం రామన్నల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నీలం మధు మాట్లాడుతూ ముఖ్యమంత్రి మీ పాలమూరు వాసి అని, రాష్ట్రంలో చేపట్టిన కుల గణనతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయ అవకాశాలు పెరుగుతాయని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యేల సీట్ల సంఖ్య పెరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేతో ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. 33 జిల్లాల్లో 119 నియోజకవర్గాల్లో బీసీలకు రాజకీయ అవకాశం దక్కుతుందన్నారు. డాక్టర్ పగిడాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కుల సంఘాల సమష్టి కృషితో ఎంతో మంది మంత్రులు, ముఖ్యమంత్రులు అయ్యారని, బీసీలు రాజకీయంగా ఎదిగేందుకు ఎన్నో అడ్డంకులు ఎదురవుతాయని ఆయన పేర్కొన్నారు. బీసీల సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పని చేయాలని డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు అల్లోజి, ఏడీ రజిని, ప్రొఫెసర్ పెబ్బేటి మల్లికార్జున్, బయన్న, మద్దిలేటి, వివిధ మండలాల గ్రామాల తెలుగు మత్స్యకారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటులో ఘర్షణ

అధికార పార్టీలోని రెండు వర్గాల పట్టు

పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ

తలలు పట్టుకుంటున్న అధికారులు

గద్వాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రం ఏర్పాటులో అధికార పార్టీలోని రెండు వర్గాలు తమకు అంటే తమకు అంటూ బహిరంగంగా ఘర్షణకు దిగారు. మేము అధికారంలో ఉన్నామని ఒకరంటే.. మేము కూడా పార్టీలో చేరాం. మా ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్ పార్టీనే అంటూ మరొకరు దూషించుకుంటూ.. కొనుగోలు కేంద్రం ఏర్పాటులో ఘర్షణకు దిగారు. చివరకు పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో విచారించి నిర్ణయం తీసుకునే వరకు ఎవరూ కొనుగోలు చేయవద్దని పోలీసులు సూచించడంతో ఘర్షణ చల్లబడింది. ఇందుకు సంబంధించిని వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలంలోని బీరోలు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవితో పాటు కార్యవర్గం మొదట నెహ్రూ సంఘంలోని సుజాత టీమ్ కొనుగోలు కేంద్రం నిర్వహించేందుకు తీర్మాణం చేశారు. దీంతో వారు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అధికారులు వారికి తేమ, తూకం మిషన్‌లు పుస్తకాలు అప్పగించారు. గురువారం ఉదయం వాళ్లు కేంద్రం ప్రారంభిస్తుండగా మరో సంఘం వాళ్లు మాకే అనుమతులు వచ్చాయి మీరు ప్రారంభించడానికి వీలు లేదంటూ అడ్డుకున్నారు. మొదటి సంఘానికి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గీయులు మద్దతు తెలిపారు. రెండో సంఘం వారికి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి వర్గీయులు మద్దతు తెలిపారు. రెండు వర్గాలు పరస్పరం అరుపులు, కేకలు వేసుకుంటూ ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. అంతటితో ఆగకుండా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. విషయం సీఐ టంగుటూరు శ్రీను దృష్టికి వెళ్లడంతో రెండు వర్గాలను స్టేషన్‌కు పిలిచి ఎవరు కొనుగోలు కేంద్రం ప్రారంభించవద్దని కలెక్టర్, డీఆర్‌డీవోలు విచారణ తర్వాత ఎవరికి ఫైనల్ చేస్తే వారే నిర్వహించుకోవాలని సూచించారు. దీంతో రెండు వర్గాలు చల్లబడ్డాయి. మొదట నెహ్రూ సంఘానికి తీర్మాణం వచ్చింది. ఆ తర్వాత వారికి తెలియకుండానే వారి తీర్మాణాన్ని రద్దు చేస్తూ పూజ సంఘానికి తీర్మాణం ఇవ్వడమే ఈ ఘర్షణకు కారణంగా తెలుస్తోంది. ఈ విషయంపై ఏపీఎం పారిజాతను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా గ్రామ సమాఖ్య మొదటి సంఘం తీర్మాణాన్ని రద్దు చేస్తూ రెండో సంఘానికి అనుమతులు ఇచ్చారని, తాము ఎక్కడ పొరపాటు చేయలేదని తెలిపారు.


బీరోలులో కొనుగోలు కేంద్రం ప్రారంభంలో అధికార పార్టీలోని రెండు వర్గాల మధ్య ఘర్షణ

స్పోర్ట్స్ బాక్స్

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు

» డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లో రాణించాలని, ఉత్తమ క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రగ్బీ ఉమ్మడి జిల్లా అండర్-14 బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలను గురువారం మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియంలో నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటలన్నారు. త్వరలో మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి, వ్యాయామ ఉపాధ్యాయులు జగన్ మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, వేణుగోపాల్, పరశురాం, బాలు జీయావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ఎంపికలను గురువారం మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియం మైదానంలో నిర్వహించారు. కార్యక్రమానికి డీవైఎస్‌వో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపి జట్టు విజయానికి కృషి చేయాలన్నారు. రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. మెదక్ జిల్లా మనోహరాబాదు... ముసాయిపేటలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొననున్నది. కార్యక్రమంలో సాదిక్‌అలీ, ఆనంద్‌కుమార్, సుగుణ, రాఘవేందర్, నాగరాజు, నాగమణి, మేరిపుష్ప,ఉమాపతిరెడ్డి, రాంమోహన్, శ్రీను, జగన్ పాల్గొన్నారు.

గో-గేమ్ టోర్నీలో విద్యార్థుల ప్రతిభ



గో-గేమ్ టోర్నీలో పతకాలు సాధించిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి గో-గేమ్ టోర్నీలో న్యూరిషి విద్యార్థులు చేతన్‌చంద్ర, రాజేష్ బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ వారిని అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడాకారులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ విష్ణుకాంత్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజులే పోయినా.. రాజ్యాలు కూలినా..



కోటపై ఉన్న ఫిరంగి



కోయిలకొండ కోటలోకి వెళ్లే ప్రధాన ద్వారం

» నిలిచి ఉన్న కోయిలకొండ ఖిల్లా
» నాలుగు వందల ఏళ్ల క్రితం నిర్మాణం
» కాకతీయుల కళా దర్పానికి ప్రత్యక్ష సాక్ష్యం
» చారిత్రక వైభవానికి నిలువెత్తు నిదర్శనం
» రాష్ట్రంలోని ఏడు గిరి దుర్గాల్లో ఇది ఒకటి

'రాజులే పోయినా.. రాజ్యాలు కూలినా.. /కాలాలు మారినా.. గాడ్పులే వీచినా..
మనుజులే దనుజులై మట్టి పాల్జేసినా../ చెదరనీ.. కదలనీ...'

ఆచార్య ఆత్రేయ రాసిన 'శిలలపై శిల్పాలు చెక్కినారూ..' పాట చివరి చరణంలోని పంక్తులివి.. అందుకు నిదర్శనమా అన్నట్లుగా మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిలకొండ ఖిల్లా ఇప్పటికీ స్థిరంగా, నిలువెత్తు వైభవానికి నిదర్శనంగా నిలిచి ఉన్నది. రాష్ట్రంలోని ఏడు గిరి దుర్గాల్లో ఒకటైన ఈ కోటను కాకతీయులు నిర్మించారు. దాదాపు నాలుగు వందల ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కోట నిర్మాణం సందర్శకుల మనసులను దోచుకుంటోంది.

\- కోయిలకొండ (ఆంధ్రజ్యోతి)

గత వైభవానికి నిదర్శనం.. కాకతీయుల కళాసృష్టికి దర్పణం.. శత్రుదుర్భేద్యం కోయిలకొండ ఖిల్లా.. మహబూబ్‌నగర్ జిల్లాలో నాలుగు శతాబ్దాల క్రితం నిర్మించిన ఈ కోటను కొండ రాళ్లను తొలచి నిర్మించారు. పెద్ద రాళ్లతో నిర్మించిన కోట గోడలు అలనాటి శిల్పులు, కార్మికుల పనితనానికి నిదర్శనంగా నిలిచివున్నాయి. కోట ఇప్పటికీ చెక్కు చెదరలేదు కానీ చుట్టూ ఉన్న దేవాలయాల్లో కొన్ని కాలగర్భంలో కలిసిపోగా, మరి కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పేరు పొందిన ఏడు గిరిదుర్గాల్లో ఒకటైన ఈ కోట చుట్టూ పలు దేవాలయాలున్నాయి. అందుకే దీనిని కోవెలకొండ అనే వారు. కాలక్రమంలో అదే కోయిల కొండగా మారిందని స్థానిక పెద్దలు చెప్తుంటారు.

సప్త ద్వారాలు.. ఏకాంత మందిరాలు

కోయిలకొండ గ్రామానికి దక్షిణ దిక్కులో ఉన్న ఎత్తయిన కొండపై ఈ కోటను నిర్మించారు. 14 వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ కోట ఇసుక, మట్టిని వినియోగించకుండా పూర్తిగా రాళ్లతోనే నిర్మించారు. కోట వెళ్లేందుకు సప్త (ఏడు) ద్వారాలున్నాయి. కోటలో రాజ మహల్, రాణి మహల్, విశ్రాంతి భవనాలు, సమావేశ మందిరాలు, అశ్వ, గజశాలలు, ధాన్యాగారాలు, ఆయుధాగారాలు నేటికీ కట్టుదిట్టంగా ఉన్నాయి. కోటలోని ఎత్తయిన ప్రాంతంలో రాజు, రాణి ఏకాంతంగా గడిపేందుకు నిర్మించిన అద్భుత కట్టడం బాలాఖిల్లా నుంచి చుట్టూ కిలోమీటర్ల మేర వీక్షించ వచ్చు. అలాగే రాజు, రాణులు స్నానం చేసేందుకు కొలనులు, తాగునీటి కోసం బండలను తొలచి నిర్మించిన పెద్ద బావులు కూడా ఉన్నాయి. శత్రువుల నుంచి కోటకు రక్షణ కల్పించేందుకు రాతితో నిర్మించిన ఎత్తయిన ప్రహరీ, భద్రతా వలయాలు ఇప్పటికీ ఉన్నాయి. ఇక్కడి నుంచి ప్రముఖ క్షేత్రం రామకొండకు సొరంగ మార్గాలున్నాయని స్థానికులు చెప్తుంటారు. కోటలోకి గుర్రాలు, ఏనుగులతో శత్రువులు ప్రవేశించకుండా అడ్డుగా ఏర్పాటు చేసిన భారీ ఇనుప గొలుసులు ఇప్పటికీ అలాగే ఉన్నాయి.

కోటపై టన్నుల బరువైన ఫిరంగులు

శత్రువులను ఎదుర్కొని, వారిపై దాడులు చేసేందుకు కోయిలకొండ ఖిల్లాపై భారీ ఫిరంగులను ఏర్పాటు చేశారు. వాటితో 20 కిలోమీటర్ల దూరంలోని శత్రువులపై కూడా దాడి చేసేవారని స్థానికులు చెప్పుకుంటారు. వాటిలో రెండు ఫిరంగులు ఇప్పటికీ ఉన్నాయి. వందల టన్నుల బరువున్న వాటిని అంత ఎత్తయిన కోట బురుజులపైకి ఎలా చేర్చారన్నది ఇప్పటికీ అంతుపట్టని రహస్యమని చెప్పవచ్చు. అలాగే కోట చుట్టూ ప్రకృతి అందాలు పర్యాటకులకు కనుల విందు చేస్తాయి. కోయిల్‌సాగర్ డ్యాం బ్యాక్ వాటర్ కూడా కోటపై నుంచి కనిపిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన బీబీ ఫాతీమా పీరును ప్రతీ సంవత్సరం ఖిల్లా పైనే ప్రతిష్ఠించి ఉత్సవాలు చేస్తారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు కర్ణాటక నుంచి అధికసంఖ్యలో ప్రజలు తరలివస్తారు. అలాగే కోటలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి, దుర్గాదేవి, పోచమ్మ, మైసమ్మ, ఆంజనేయ స్వామి ఆలయాలున్నాయి. కొండకు సమీపంలోనే వీరభద్రస్వామి, శ్రీరామకొండ దేవాలయాలున్నాయి.

కర్ణాటకలోని చించోలి వరకు పాలన

కోయిలకొండ కోటను కాకతీయుల కాలంలో నిర్మించినట్లు క్రీస్తుశకం 1521 నాటి శిలాశాసనం ద్వారా తెలుస్తోంది. 1482 నుంచి 1518 వరకు కోయిలకొండ రాజ్యం వర్ధిల్లినట్లు ఆధారాలు లభించాయి. దాదాపు వందేళ్ల క్రితం కోయిలకొండ గ్రామానికి చెందిన బరారు శ్రీనివాసశర్మ రచించిన చారిత్రాత్మక నవల 'ఆశాదోశం' ద్వారా కోట చరిత్ర, నాటి పాలకులు, కోటపై జరిగిన దండయాత్రలు తదితర ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. కోయిలకొండకు రాజుగా సఫాయి బసవరాజు, సేనాధిపతిగా యాదవ రావు, అర్థికశాఖ నిర్వాహకుడిగా గంభీరరావు ఉండేవారు. ఇక్కడి పాలకులు కర్ణాటక రాష్ట్రం చించోలి ప్రాంతం వరకు పాలన కొనసాగించారు. ఈ కోటను ఎలాగైనా ఆక్రమించు కోవాలని గోల్కొండ నవాబు కులీకుతుబ్‌షా పలుమార్లు కోటపై దాడులకు యత్నించారు. ఈ దాడులను పాలుకులు ఎదుర్కొని రాజ్యాన్ని కాపాడుకున్నారు. ఆ సమయంలో పాలకుడు సఫాయి బసవరాజుకు మిత్రులైన విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయుల అల్లుడు అలియరామ రాయలు, అచ్యుతరాయలు, వెలుమ రాజులు, వడ్డె రాజులు కోటను సందర్శించినట్లు ఇక్కడి చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఆ తర్వాత గోల్కొండ రాజు కుతుబ్ షా సఫాయి బసవరాజును అంతం చేసి కోటను ఆక్రమించుకోవడంతో వారి పాలన ముగిసింది.



కోయిలకొండ ఖిల్లా

కోటకు ఇలా చేరుకోవాలి

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి 23 కిలో మీటర్ల దూరంలో కోయిలకొండ కోట ఉంది. బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల్లో మండల కేంద్రమైన కోయిలకొండకు వెళ్లాలి. అక్కడి చౌరస్తా నుంచి కోటకు చేరుకోవచ్చు. ఖిల్లా కింది భాగం వరకు వాహనాల్లో వెళ్లవచ్చు. అక్కడి నుంచి మెట్ల మార్గంలో కోట పైకి వెళ్లాల్సి ఉంటుంది. అయితే పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న ఈ కోట అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థాని కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ అద్భుతమైన ఖిల్లాకు తగిన ప్రాధాన్యం, ప్రాచుర్యం కల్పించాలని కోరుతు న్నారు. అందుకు పర్యాటక శాఖ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, సందర్శకులకు వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళ మృతి

మానవపాడు, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల పరిధిలోని పెద్ద పోతులపాడు గ్రామానికి చెందిన చిన్న మద్దిలేటి భార్య లక్ష్మీదేవికి కొన్ని నెలల నుంచి మతిస్థిమితం తప్పింది. కుటుంబసభ్యులు ఆమెకు పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మీదేవి, బుధవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. కుమారుడు రామాంజనేయులు గమనించి వెంటనే ఆమెను కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఆమె భర్త చిన్న మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చిన్నంబావి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని కాలూరు గ్రామానికి చెందిన సుధాకర్ (44) అనే వ్యక్తి పురుగుల మందు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆయన స్వగ్రామం సంపత్రావుపల్లి కాగా, మామిడి తోటలో పని చేసేందుకు భార్యతో కలిసి ఏడు నెలల క్రితం కాలూరుకు వచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారు జామున ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

నవాబ్‌పేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారి అబ్దుల్‌మజీద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా, చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన రవీందర్ అనే వ్యక్తి కొంత కాలంగా పరిసర గ్రామాల్లో తిరుగుతూ, ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు అతడి కిరాణం దుకాణంలో తనిఖీ చేయగా, 26 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అధికారుల సమాచారం మేరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు.

వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత

నవాబ్‌పేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని లోకిరేవు గ్రామానికి చెందిన గోరెంక చెన్నమ్మ అనా రోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న నారాయణపేట ప్రభుత్వ వైద్య కళాశాల సిబ్బంది ఆమె కుమారుడు కృష్ణను సంప్రదించడంతో అవయవ దానానికి అంగీకరించారు. దీంతో ఆమె కళ్లను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి, దేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించారు.



చెన్నమ్మ (ఫైల్)

వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

పెద్దకొత్తపల్లి, నవంబరు, 21 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధింపులను భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్ద కొత్తపల్లి మండలం, మహసముద్రం గ్రామంలో గురువారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ప్రశాంతి (21)కి పాన్‌గల్ మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణతో గత ఏడాది వివాహమైంది. కానీ భర్త నిత్యం వేధిస్తుండటంతో భరించలేక పుట్టింటికి వచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీశ్ తెలిపారు.

తమ్ముడి హత్య కేసులో అన్న అరెస్ట్

» కొడుకులతో కలిసి సోదరుడిపై దాడి
» ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
» వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : భూ తగాదా నేపథ్యంలో తమ్ముడిపై అన్న, తన కొడుకులతో కలిసి దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు వివరాలను ఎస్పీ శ్రీనివాస్ గురువారం వెల్లడించారు. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం అరగిద్ద గ్రామానికి చెందిన నల్లన్న, ఆయన కుమారుడు సంజీవులు ఈ నెల 15న తన పొలం వద్ద ఉన్నారు. అతడి అన్న బెండల్ కుంటన్న ఆయన కొడుకులు బెండల్ హన్సేన్, చిన్న తిమ్మప్ప పశువులను మేపేందుకు వచ్చారు. తమ పొలంలో ఇంకా పత్తి ఉందని, పశువులను ఎలా మేపుతారని నల్లన్న వారిని ప్రశించారు. దీంతో ముగ్గురూ కలిసి వారితో గొడవకు దిగి కర్రలు, రాళ్లతో దాడి చేశారు. కొడుకు సంజీవ్ అడ్డుపడగా అతడిపైనా దాడికి దిగడంతో పారిపోయాడు. అప్పటికే నల్లన్న స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబసభ్యులు అతడిని కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు భార్య లక్ష్మి గట్టు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నల్లన్న ఈనెల 18న మృతి చెందాడు. దీంతో పోలీసులు దాడి కేసును హత్య కేసుగా మార్చి నమోదు చేశారు. ఈ విషయం తెలియడంతో నిందితులు ఊరి నుంచి పారిపోయారు. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశం మేరకు సీఐ టంగుటూరి శ్రీను పర్యవేక్షణలో కేటీదొడ్డి ఎస్‌ఐ మల్లేష్, పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ నెల 20న వారు మల్దకల్ కొత్తబస్టాండ్ దగ్గర ఉన్నట్లు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకొని వారిని అరెస్ట్ చేశారు. దాడికి వినియోగించిన కర్రలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గురు వారం కోర్టులో హాజరు పరిచి, న్యాయాధికారి ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలించి నట్లు ఎస్పీ వివరించారు.

బాలల అక్రమ రవాణా ఆందోళనకరం

» న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించాలి
» న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర
» జిల్లా జైలు పరిశీలన



జిల్లా జైలు ఆవరణలో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర

మహబూబ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాలల అక్రమ రవాణా ఆందోళనకు గురి చేస్తోందని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర అన్నారు. బాలికలు మానసికంగా, శారీరకంగా అత్యాచారాలకు గురవుతున్నారన్నారు. గ్రామాల్లో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించాలని ప్యానెల్ అడ్వకేట్‌లు, పారా లీగల్ వలంటీర్లకు సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాల్సా స్కీమ్ - 2024 గురించి వివరించాలని సూచించారు. ప్యారా లీగల్ అడ్వకేట్‌లు, ప్యానెల్ అడ్వకేట్‌లకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అంతకు ముందు జిల్లా జైలుకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. బ్యారక్‌ల వద్ద ఖైదీలతో మాట్లాడారు. వారి కేసులను వాదించేందుకు న్యాయవాదులు ఉన్నారా? లేరా? అడిగి తెలుసుకున్నారు. బెయిల్ తీసుకునే స్థోమతపై ఆరా తీశారు. ఎవరికైనా ఇబ్బందులుంటే ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వెంకటేశం, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

మహబూబ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణంలోని ఏనుగొండ వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి ఓ మహిళ (60) మృతి చెందింది. స్థానికులు గమనించి, రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. స్టేషన్‌మాస్టర్ ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్‌ఐ అక్బర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వివాహిత అదృశ్యం

భూత్పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని వెల్కిచర్ల గ్రామానికి చెందిన గొల్ల నారమ్మ (46) అదృశ్యమైంది. గ్రామానికి చెందిన గొల్ల నారమ్మ (46), ఆమె భర్త వెంకటయ్య ఈ నెల 16న రాత్రి ఎప్పటిలాగే ఇంట్లో నిద్రపోయారు. మరుసటి రోజు ఉదయం వెంకటయ్య నిద్ర లేచేసరికి నారమ్మ కన్పించలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుమారుడు భరత్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురి రిమాండ్

లింగాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండలం మల్లభాపురం గ్రామానికి చెందిన గాలి వెంకటయ్య పొలంలోని ఏడు స్పింక్లర్లను ఈనెల 16న కడెం ఎల్లస్వామి, మద్దెల వెంకటయ్య, చింత మల్లేష్ అనే వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేశారు. వారిని గురువారం కోర్టులో హాజరు పరిచి, న్యాయాధికారి ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలు శిక్ష

» మరికొందరికి జరిమానా

పెబ్బేర్ రూరల్, ఆత్మకూరు, అమరచింత, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలను నడుపుతూ, డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడిన పలువురికి జైలు శిక్ష, మరికొందరికి జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. వనపర్తి జిల్లాలో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పెబ్బేరు మండలం, రాంపురం గ్రామానికి చెందిన వై.రంగారెడ్డి, శ్రీరంగాపురం మండలం శేరుపల్లి గ్రామానికి చెందిన శివ, వనపర్తి మండలం సవాయి గూడెం గ్రామానికి చెందిన రాజు, కొత్తకోట మండలం భూత్పూర్ గ్రామానికి చెందిన జీ వెంకటేశ్ పట్టుబడ్డారు. వారిని గురువారం జిల్లా కోర్టులో హాజరు పరుచగా, నలుగురికీ మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు పెబ్బేరు ఎస్‌ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.

అమరచింత పట్టణ శివారులో పోలీసులు బుధవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా, తిరుమలాపూర్ గ్రామానికి చెందిన ఎండి ఖదీర్ అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని గురువారం కోర్టులో హాజరు పరచగా, న్యాయాధికారి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

ఆత్మకూరు పట్టణానికి చెందిన శ్రీకాంత్, గుంటిపల్లి గ్రామానికి చెందిన రాములు, నందిమల్ల గ్రామానికి చెందిన సురేశ్‌లు మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు. వారిని గురువారం జిల్లా కోర్టులో హాజరు పరచగా, ఒకొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఆత్మకూరు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతూ పట్టుబడిన ఆత్మకూరు పట్టణానికి చెందిన సద్దాం, శేఖర్‌లపై బుధవారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా, రెండు వందల రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు.

న్యూస్ బాక్స్

అభయుడి బ్రహ్మోత్సవాలపై ఎమ్మెల్యే సమీక్ష

పదర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెట్రాల్‌చేను చెంచుపెంటలో ఆదివాసీలు మల్టీపర్పస్ సెంటర్‌ను ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ ప్రారంభించారు. అనంతరం మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. డిసెంబరు మాసంలో జరగబోయే బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాములు నాయక్, ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య శాస్త్రీ, నాయకులు, అధికారులున్నారు.

అనారోగ్యంతో మహిళా సమాఖ్య ఏపీఎం మృతి

అమ్రాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల మహిళా సమాఖ్య ఏపీఎం జి.రామ్‌రెడ్డి అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా యాచారం మండల కేంద్రానికి చెందిన రామ్‌రెడ్డికి భార్య, కుమారుడు, కూతురు ఉంది. ఏపీఎం మృతి పట్ల సమాఖ్య ప్రతినిధులు, సహ ఉద్యోగులు, మండలంలోని వివిధ శాఖల వారు సంతాపం ప్రకటించారు.

విద్యాభివృద్ధి కోసం వినతి

పదర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంకేశ్వరం జడ్పీహెచ్ పాఠశాలలో వసతులు కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణకు గురువారం వంశీ యువసేన అధ్యక్షుడు నెల్లికంటి శివకుమార్ వినతి అందించారు. అదే విధంగా గ్రామంలో ఉన్న ఎస్సీ వసతి గృహంలో కరెంటు రాత్రి సమయంలో ఉండటం లేదని, దాంతో విద్యార్థులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు అక్కడి నుంచే ఫోన్ చేసి జడ్పీహెచ్‌ఎస్‌లో బోరు, వసతి గృహంలో ట్రాన్స్‌ఫార్మర్ యేయమని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏఆర్ యాదవ్, నాయకులు మల్లయ్య, విజ్జి, నాగేష్ ఉన్నారు.

ఫిట్‌నెస్‌లేని బస్సులను సీజ్ చేయాలి

- ఏఐఎస్‌ఎఫ్, ఏఐటీయూసీ డిమాండ్

కందనూలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఫిట్‌నెస్ లేని బస్సులు పరిమితికి మించి బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న బస్సులను సీజ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్, ఏఐటీయూసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాగుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డీటీవో బాలుకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధుగౌడ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నితిన్, నాయకులు ప్రసాద్, శివకేశవ్, రాజు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ

కల్వకుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ఎస్సీబాలుర-బి వసతి గృహంలో విద్యార్థులకు గురువారం ఉలెన్ బ్లాంకెట్స్, మంకీ క్యాప్స్, స్వెటర్లను హెచ్‌డబ్ల్యూవో దీప పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం దుప్పట్లు, స్వెటర్లు, మంకీ క్యాప్స్ అందించడం జరిగిందని పేర్కొన్నారు. కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని దీప అన్నారు.

పాఠశాలలో బోరు మోటార్ కేబుల్ వైరు చోరీ

వంగూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిప్పారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు తాగునీటి బోరు మోటార్ కేబుల్ వైరును కోసుకెళ్లారు. ఈ మేరకు గురువారం ఎంఈవోకు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెచ్‌ఎం బాబురావు ఫిర్యాదు చేశారు.

ఆలయ అభివృద్ధి కోసం శాశ్వత సభ్యత్వాల నమోదు

మన్ననూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సామాంత రాజుల కాలంలో నిర్మించిన మన్ననూరు వేణుగోపాల స్వామి ఆలయం జీర్ణావస్థ దశలో ఉండగా, ఆలయ అభివృద్ధి చేసేందుకు గ్రామస్థులు శాశ్వత సభ్యత్వాన్ని తీసుకుంటున్నారు. ఆలయ భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో గ్రామంలో సభ్యత్వాల నమోదు ప్రక్రియను గురువారం ప్రారంభించారు.సభ్యత్వానికి రూ.వెయ్యి నగదు చొప్పున చెల్లించి సభ్యత్వాలను నమోదు చేయించుకున్నారు. కార్తీక పౌర్ణమి నుంచి మొదలైన సభ్యత్వాల నమోదు సంఖ్య గురువారానికి 40 కి చేరుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ భజన మండలి సభ్యులు పులిజాల శేఖర్, బాలకృష్ణ, సురేష్ యాదవ్, మాడ్గుల నర్సింహ, చంద్రమౌళి, జయమ్మ, సరస్వతి, ప్రభావతమ్మ పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి

కోడేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని మండల విద్యాధికారి భాస్కర్ శర్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎత్తం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతు ఆగమాగం

- కానరాని కొనుగోలు కేంద్రాలు
- బస్తాకు 5కిలోల వరకు తరుగు తీస్తున్న దళారులు
- తూనికల, కొలతల్లోనూ తేడాలు
- తెలిసినా చర్యలు తీసుకోని అధికారులు


మొక్కజొన్నను అమ్ముకోవడానికి మార్కెట్‌కు తెచ్చిన రైతులు

లింగాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కష్టనష్టాలను ఓర్చుకుని పండించిన పంటలను అమ్ముకుందామంటే దళారులు నిండా ముంచేస్తున్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా, మండలంలో ఎక్కడా లేవు. దీంతో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బస్తాకు రెండున్నర కిలోలు, క్వింటాలుకు ఐదు కిలోల వరకు అధికంగా తూకం చేస్తుండడంతో రైతులు గత్యంతరం లేక అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు దందా తెలిసినా అధికారులు తమకేమీ పట్టనట్లు ఉండడంతో మొక్కజొన్న రైతులు ఆగమవుతున్నారు.

సబ్ మార్కెట్ యార్డు నిరుపయోగం

అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌కు అనుబంధంగా మండల కేంద్రంలో సబ్ మార్కెట్ యార్డు ఉన్నప్పటికీ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. ధాన్యం అమ్ముకోవాలంటే 25కిలో మీటర్ల దూరంలో ఉన్న అచ్చంపేటకు తీసుకుపోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. వ్యవసాయ మార్కెట్ కమిటీ మండలానికి ఒకరు డైరెక్టర్ ప్రాతినిథ్యం వహిస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం బస్తాకు ఒక కిలో మాత్రమే తరుగు, తేమ శాతం 17శాతం మించకుండా తాలు, మట్టి పెళ్లల్లు, చెత్తాచెదారం, నాణ్యత దృష్టిలో పెట్టుకుని తూకం వేయాల్సి ఉంటుంది. గోనె సంచి బరువు(600 గ్రాములు)తో కలిపి బస్తాకు 50.6కిలోల తూకం వేయాల్సి ఉంటుంది. కానీ, బస్తాకు మూడు కిలోల వరకు తరుగు తీయడంతో పాటు తూకాల్లో సైతం మోసాలకు పాల్పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లల్లో మోసాలను అరికట్టడంతోపాటు మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తే ఉపశమనం కలుగుతుందని రైతులు కోరుతున్నారు.

13వేల ఎకరాలలో సాగు

మండలంలో 13వేల ఎకరాలలో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ప్రస్తుతం సీజన్ కావడంతో మొక్కజొన్న పంట అమ్మకానికి తీసుకెళ్తున్నారు. క్వింటాల్‌కు రూ.1800 నుంచి రూ.2400 వరకు ఉండగా తూకాల్లో తేడాలు, ఆరు కిలోల తరుగు రూ.వెయ్యికి రూ.3 కమీషన్, హమాలీ రూ.22 బస్తాకు వాహన ఖర్చు రూ.15గా మొత్తంగా క్వింటాల్‌కు దాదాపు రూ.200 వరకు నష్టపోవాల్సి వస్తుంది.

రైతులు వినియోగించుకోవాలి

- వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో నాయకులు, అధికారులు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో నీతి రెడ్డి

బిజినేపల్లి/ లింగాల/ కల్వకుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాయకులు, అధికారులు కోరారు. బిజినేపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో ఏవో నీతిరెడ్డి, లింగాల మండలం అంబటిపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ హనుమంతురెడ్డి ప్రారంభించారు. కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేపట్టేందుకు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని, వాటిని వినియోగించుకోవాలని వారు కోరారు. రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చే ముందు విధిగా తేమ శాతం 14కన్నా తక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన గన్నీ బ్యాగులను పీఏసీఎస్ సిబ్బంది ద్వారా తీసుకొని ధాన్యం బ్యాగుల్లో నింపి తూకం వేయించుకోవాలని తెలిపారు. సన్నరకం వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో పాటు రూ.5 వందల బోనస్ ఇస్తుందని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బిజినేపల్లిలో మాజీఎంపీటీసీ సభ్యుడు దారెడ్డి రఘు మారెడ్డి, వంగ రామన్‌గౌడ్, జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ మస్కూరి బంగారయ్య, దారెడ్డి కొండారెడ్డి, బొనమోని వెంకటయ్య, ఆంజనేయులు, బాలపీరు. వెంకట్‌రెడ్డి, బాలరాజు, పదుమ శ్రీను, ఏఈవో విష్ణు ఉన్నారు. లింగాలలో మాజీ సింగిల్ విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏఈవో శివానంద్, సీఈవో పాండు, నాయకులు అచ్చుతారెడ్డి, మాధవులు గౌడ్,పరమేశ్వర్‌రెడ్డి, బంగారయ్య పాల్గొన్నారు.

అంబటిపల్లిలో కేంద్రాల తనిఖీ

లింగాల మండల పరిధిలోని అంబటిపల్లి, మండల కేంద్రమైన లింగాలలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ వేముల నాయక్ తనిఖీ చేశారు. ఆయన వెంట పీఏసీఎస్ సీఈవో పాండు, రైతులు ఉన్నారు.

కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్ రెడ్డితో పాటు వైస్ చైర్మన్ శ్యామ్, మార్కెట్ సెక్రటరీ భగవంతు, ఏవో సురేష్, డైరెక్టర్ వెంకటయ్య, సీఈవో వెంకట్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలు

- ప్రపంచ మత్స్యకార్మిక దినోత్సవంలో ముదిరాజ్‌ల ర్యాలీలు
- కేకులు కట్‌చేసి సంబురాలు


జిల్లా కేంద్రంలో ముదిరాజ్ మహాసభ జెండావిష్కరణలో నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్/ అచ్చంపేట/ తెలకపల్లి/ లింగాల/ చారకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ముదిరాజ్ సంఘం జెండాను ఆవిష్కరించారు. ముదిరాజ్ మహాసభ మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి రైతుబజారు గేటు వద్ద ముదిరాజ్ జెండావిష్కరించారు. ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు గూళ్ల హరికృష్ణ మాట్లాడుతూ ముదిరాజ్ మహాసభ ఏర్పడి పదేళ్లకాలంలో మత్స్యకారుల హక్కులకోసం అనేక పోరాటాలు చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు తవిటి నరసింహ, రాజు, గొడుగు సహదేవుడు, చాపల వెంకటయ్య, తెప్ప శేఖర్, తెప్ప రుద్రయ్య, సందు యాదగిరి, రాజు, తిరుప యత్యవెంకటస్వామి, వెంకటయ్య, శివబాబు, శ్రీను, కర్ణ, తెప్ప రవి, బాలకృష్ణ, చెన్నకేశవులు, చెన్నయ్య, రమేష్, శివ, తెప్ప బాబు, కృష్ణ పాల్గొన్నారు.

● ప్రపంచ మత్స్యకార్మిక దినోత్సవం సందర్భంగా బుధవారం అచ్చంపేట పట్టణంలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ ముదిరాజ్ సంఘం తాలూకా అధ్యక్షుడు అజనమోని నరసింహ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం తాలుకా ప్రధాన కార్యదర్శి బాలరాజు, మత్స్యసంఘం నాయకులు వెంకటయ్య, నరేష్, పాపయ్య, రేణయ్య, దశరథం, సైదులు, వెంకటయ్య, రవి, లింగస్వామి, సత్యానారాయణ పాల్గొన్నారు.

● తెలకపల్లిలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం భవనంలో గురువారం ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ జంగం సత్యనారాయణ, సెక్రటరీ కటికల యాదయ్య, బాషమోని రాములు, శ్రీను, తిరుపతయ్య, రమేష్, సత్యనారాయణ, శివ, పాల్గొన్నారు.

● లింగాలలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు కొండమోని సత్యం ముదిరాజ్ ఆధ్వర్యంలో మత్స్యకారులు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లో సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు లింగస్వామి, మండల కార్యదర్శి నలేశ్వరం, ఉపాధ్యక్షుడు గుడి శ్రీను, వెంకటయ్య, లక్ష్మయ్య, ఆంజనేయులు, నిరంజన్, గడ్డిపోగుల శివ, మల్లయ్య పాల్గొన్నారు.

● చారకొండ మండలం చంద్రాయన్‌పల్లిలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సొప్పరి పర్వతాలు ముదిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు మత్స్యకారుల జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకార పారిశ్రామిక సంఘాలకు ఉచిత చేప పిల్లలను పంపిణీ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో జిల్లా ఏడీ డాక్టర్ రజినీ చేతలు మీదుగా నాగర్ కర్నూల్ మండలం పరిధిలోని 18 గ్రామాల మత్స్య సంఘాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ మత్స్యకార సంఘాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వందశాతం సబ్సిడీతో చేప పిల్లలను అందజేస్తోందని పేర్కొన్నారు. చేప పిల్లల సైజు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘాల మండల అధ్యక్షుడు గూళ్ల హరికృష్ణ ముదిరాజ్, మత్స్యశాఖ సిబ్బంది అచ్చన్న, రిషి, వెంకటేష్, మహేష్, తిరుపతయ్య, రాములు, వెంకటయ్య, నిరంజన్, వెంకటస్వామి, రాజు, రాజేష్, మస్తాన్, శివ, పర్వతాలు, భాస్కర్, శోభన్, అశోక్, బంగారయ్య పాల్గొన్నారు.

24న గద్దర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

కల్వకుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో ఈ నెల 24న దివంగత గద్దర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులతో కలిసి కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ పరిశీలించారు. భూమి పూజ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ గుమ్మడి వెన్నెలగద్దర్ హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విగ్రహ నిర్వహణ కమిటీ నాయకులు సదానందంగౌడ్, జంగయ్య, బొజ్జన్న, సంజీవ్, గోపాల్, రవి, శేఖర్, భిక్షపతి, జగన్, వెంకటరమణ, నరసింహ, రాము, కుమార్, రజిత ఉన్నారు.

తప్పుడు సమాచారమిచ్చే వారిపై చర్యలు తీసుకోవాలి

- మాలల చైతన్య సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాందాస్

కొల్లాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే కుల గణనలో అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాలల చైతన్య సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రాందాస్ డిమాండ్ చేశారు. కులగణనలో గొల్ల కురువలు మాదాసి కురువలు కులం నమోదు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాలల చైతన్య సమితి ఆధ్వర్యంలో కొల్లాపూర్ ఆర్డీవో భన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. రాందాస్‌తోపాటు తాలూకా అధ్యక్షుడు ఎర్ర శ్రీనివాసులు, పాలెం కేశవులు, నాగటి మోహన్ మాట్లాడుతూ వివక్షకు గురవుతున్న జాతులు అభివృద్ధి చెందకుండా కొంతమంది సర్వేలో అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని పేర్కొన్నారు.

పాఠశాలకు ఫిల్టర్ వాటర్ ప్లాంట్ వితరణ

చారకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూపల్లి ప్రాథమిక పాఠశాలకు వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు సహకారంతో ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను గురువారం ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఫిల్టర్ వాటర్ ప్లాంట్ వితరణ చేసిన జూపల్లి భాస్కర్ రావుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు భాస్కర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రవల్లి మాజీ సర్పంచ్ సాయికుమార్, సీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు అద్దెకు కావాలంటూ వెండి ఆభరణాల చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చి, వృద్ధురాలికి మత్తు పానీయం ఇచ్చి ఆమె వద్దనున్న వెండి గొలుసులు, కడియాలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్ కాలనీలో జరిగింది. ఎస్‌ఐ గోవర్ధన్ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్‌ఆర్ కాలనీలోని జానమ్మ ఇంటికి ఈ నెల 18న ముగ్గురు వ్యక్తులు వచ్చారు. ఇల్లు అద్దెకు కావాలని అడిగారు. ఆమెకు మాయ మాటలు చెప్పి, మత్తు పానీయం ఇచ్చారు. ఆమె మత్తులో పడిపోగానే 40 తులాల వెండి కడియాలు, వెండి గొలుసులు ఎత్తుకెళ్లారు. సంఘటనపై బాధితురాలి కుమారుడు ఇటిక్యాల కొండల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు కోసం దరఖాస్తులు ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జనవరి-2025లో నిర్వహించనున్న టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు కోసం డిసెంబరు 3 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం రూ.50తో డిసెంబరు 10 వరకు, అపరాధ రుసుం రూ.75తో డిసెంబరు 17లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

పేదల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

- ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయి మహరాజ్

బల్మూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల అవసరాలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిమహరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర, జిల్లా కమిటీ ఆదేశాల మేరకు పేద, మధ్య తరగతి వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలిపారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ పర్సునాయక్‌కు అందజేశారు. డీఎస్పీ మండల అధ్యక్షుడు భాస్కర్, శివ, నరేందర్, చంద్రశేఖర్, మాలిక్ పాల్గొన్నారు.

దివ్యాంగులు నిరుత్సాహపడొద్దు

- కలెక్టర్ సంతోష్


జెండా ఊపి క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత కాలంలో దివ్యాంగులమని నిరుత్సాహ పడవద్దని, వికలత్వమనేది శరీరానికే తప్ప మనస్సుకు, ఆలోచనకు కాదని నిరూపించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. డిసెంబరు 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని గురువారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. డీడబ్ల్యూవో రాజేశ్వరి, సంబంధిత అధికారులు దివ్యాంగులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ట్రైసైకిల్ పరుగు, చెస్, క్యారమ్, షార్ట్ పుట్, ఆటల పోటీలు నిర్వహించగా కలెక్టర్ దివ్యాంగులను ఉత్సాహపరిచేందుకు షార్ట్‌పుట్ క్రీడాపోటీల్లో కలెక్టర్ సైతం పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఇతరులకు ఏ విధంగా కూడా తీసిపోకుండా తమ శక్తిసామర్థ్యాలను ప్రదర్శిస్తున్నారని అన్నారు. క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు పాల్గొన్న వారందరికీ డిసెంబరు 3న జరిగే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయులు సుభాషిని, జిల్లా దివ్యాంగుల సంఘం సభ్యులు, దివ్యాంగులైన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేను తనిఖీ చేసిన డిప్యూటీ సీఈవో


సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటి సీఈవో గోపాల్

పెద్దకొత్తపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింట కుల, ఆర్థిక, రాజకీయ, ఉద్యోగ, సామాజిక అంశాలపై పెద్దకొత్తపల్లి మండలం దేవునితిరుమలాపురం గ్రామంలో చేపట్టిన సర్వేను నాగర్ కర్నూల్ జడ్పీ డిప్యూటీ సీఈవో గోపాల్ గురువారం తనిఖీ చేశారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయంలో సూపర్ వైజర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శరవేగం గా నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూపర్‌వైజర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేంద్రం, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అటవీ సిబ్బందికి ఇన్సూరెన్స్ బాండ్లు అందజేత

కొల్లాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నల్లమల అటవీ రేంజ్ పరిధిలో పని చేస్తున్న అటవీ శాఖలో పనిచేస్తున్న వివిధ రకాల సిబ్బందికి ఇన్సూరెన్స్ బాండ్లను ఫారెస్టు రేంజ్ అధికారి చంద్రశేఖర్ అందజేశారు. అటవీశాఖలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది, బేస్ క్యాంపు వాచర్లకు, డ్రైవర్లకు, కార్యాలయంలో ఉన్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది మొత్తం 21మందికి అటవీ శాఖ తరఫున రాష్ట్ర అపతి కావాచ్ పాలసీ, వన సంరక్షక్ సేవ సమితి ద్వారా నుంచి 10 లక్షల ఇన్సూరెన్స్ బాండ్లను గురువారం ఎఫ్ఆర్‌వో అందజేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ సెక్షన్ అధికారులు ముజీబ్ ఘోరి, బయ్యన్న, శివకుమార్, నీలేష్, జయరాజ్, మల్లేష్, బీట్ అధికారులు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించండి

- సహాయ సంచాలకులు జగ్గు నాయక్


మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు జగ్గు నాయక్

కొల్లాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలని కొల్లాపూర్ నియోజకవర్గం వ్యవసాయ సహాయ సంచాలకులు జగ్గు నాయక్ పేర్కొన్నారు. కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గురువారం నియోజకవర్గ పరిధిలో ఉన్న ఫర్టిలైజర్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నియోజకవర్గ వ్యవసాయ సహాయ సంచాలకులు జగ్గు నాయక్ మాట్లాడుతూ... డీఏపీ ఎరువుల లభ్యత తక్కువగా ఉన్నందువల్ల వాటి స్థానంలో కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని పెంచాలని ప్రోత్సహించాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో వివిధ మండలాల వ్యవసాయ అధికారులు చిన్న హుస్సేన్ యాదవ్, శిరీష, నాగజ్యోతి, వికాస్, ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చవద్దు

పెద్దకొత్తపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరి పంటను కోసిన తరువాత పొలాల్లో వరి కొయ్యలను కాల్చవద్దని గంట్రావుపల్లి ఏఈవో అనిల్‌కుమార్ అన్నారు. రైతులు వరి కొయ్యలను కాల్చడం వలన నేలలో ఉండే కార్బనము పంట పెరుగుదలకు ఉపయోగపడే జీవులు నశించడంతో పాటు పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని ఆయన సూచించారు.

గ్రంథాలయం నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు

నాగర్‌కర్నూల్‌టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ భవనం పనులను త్వరగా పూర్తి చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు డిమాండ్ చేశారు. గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. మధు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ నిర్మాణ పనులు నెలల తరబడి నడుస్తున్నాయని, దీంతో పాత భవనంలో సరైన సౌకర్యాలు లేక పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి జిల్లా గ్రంథాలయ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి పాఠకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శివరాం, డీవైఎఫ్ఐ నాయకులు నవీన్, రాజు, అనిల్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఏడీఏ ఆకస్మిక తనిఖీ

బిజినేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో నాగర్‌కర్నూల్ ఏడీఏ గురువారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను, ఎరువుల, విత్తనాల నిల్వలను పరిశీలించి మాట్లాడారు. ప్రతీ రైతుకు విక్రయించిన ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారకాల బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. కల్తీ విత్తనాలు, కాలం చెల్లిన పురుగుల మందులను విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణదారుడి లైసెన్స్ రద్దు చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన ఎరువులు, పురుగుల మందులను మాత్రమే రైతులకు ఇవ్వాలన్నారు. లట్టుపల్లి, బిజినేపల్లి తదితర గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేసినట్లు తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్ సన్నాహక సమావేశం

కొల్లాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంపై జూనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జ్యోత్స్న గుంటి గురువారం జూనియర్ సివిల్ కోర్టులో సన్నాహక సమావేశం నిర్వహించారు. స్థానిక బార్ అసోసియేషన్ ప్రాసిక్యూషన్, పోలీసు అధికారులతో, బ్యాంకు అధికారులతో, వచ్చే నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ గురించి జూనియర్ సివిల్ న్యాయాధికారి చర్చించారు. ఈ సదస్సుకు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు రామలక్ష్మమ్మ, కార్యదర్శి నిరంజన్, ఏపీపీ శిరీష, లోక్ అదాలత్ సభ్యులు కురుమూర్తి, న్యాయవాదులు బాలస్వామి, నాగరాజు, రాజు, మల్లయ్య, స్థానిక సీఐ మహేష్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, కొల్లాపూర్, కోడేర్ ఎస్‌ఐలు హృషికేష్, గోకారి, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ హనుమంత్ నాయక్, పెంట్లవెల్లి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ మేఘశ్యామ్, విశ్వనాథ్, లోక్‌అదాలత్ సిబ్బంది హరికృష్ణ, పోలీస్ కానిస్టేబుల్స్ రాములు, రాముడు, సత్యనారాయణ, రాజశేఖర్ తదితరులు హాజరయ్యారు.

శ్రీచైతన్య ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కందనూలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ ఈశ్వర్ కాలనీలో గల శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం సేఫ్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ ఎం.కల్యాణ్‌యాదవ్ పాల్గొని రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమ అనంతరం విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి నాగర్‌కర్నూల్ పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం ఎస్.భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజీవ్ ప్రియదర్శన్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.